క్లుప్తంగా

400 మందికి వైద్య పరీక్షలు



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ వెంకయ్య

మర్రిపూడి: స్ఫూర్తి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య ప్రారంభించారు. శిబిరంలో 400 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేసినట్లు ట్రినిటీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గురిజాల యోబు తెలిపారు. ఆయన వెంట కొనకనమిట్ల వైద్యాధికారి బాలయ్య, డాక్టర్ నాగేశ్వరరావు, స్ఫూర్తి స్వచ్ఛంద సేవా సంస్థ గౌరవసలహాదారుడు బీవీ రావు, నీల్, ఎన్ హరిబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బోద రమణారెడ్డి, సీనియర్ నాయకులు మాచేపల్లి నాగయ్య, మర్రిపూడి సొసైటీ అధ్యక్షుడు బీవీ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల సంతోషమే ప్రభుత్వ లక్ష్యం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు



కట్టుబడిపాలెం గడప గడపకు మన ప్రభుత్వంలో వరికూటి

కొండపి(సింగరాయకొండ): అర్హులందరికీ నవరత్నాల పథకాలను అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, ఇదే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. కొండపి మండలం వెన్నూరు గ్రామ పంచాయతీ పరిధిలోని చిన్న వెంకన్నపాలెం, కట్టుబడిపాలెంలో శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వరికూటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక కారణాల వల్ల ప్రభుత్వ పథకాలు అందని వారిని గుర్తించి వారికి ప్రభుత్వ పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు ఆడింది ఆటగా పాడింది పాటగా అర్హత ఉన్నా, లేకపోయినా వారి ఇష్ట ప్రకారం ప్రభుత్వ పథకాలు అందించారని, అర్హులైన పేదలను గాలికి వదిలేశారని ఆరోపించారు. కానీ ఇప్పుడేమో చంద్రబాబు పేదలపై వల్లమాలిన ప్రేమ చూపించడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో లక్షలాది మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారని, ఇప్పటికే చాలా మంది ఆ స్థలంలో తమ అభిరుచికి తగ్గట్లు చక్కని ఇళ్లు నిర్మించుకుని నివసిస్తుంటే ఇప్పుడేమో చంద్రబాబు తన పాలనలో పేదలకు ఒక్క సెంటు స్థలం కూడా ఇవ్వకుండా జగన్ ఇచ్చిన ఒకటిన్నర స్థలం శవాన్ని పూడ్చడానికి సరిపోతుందని వ్యాఖ్యానించడం పేదల పట్ల ఆయన వైఖరి అర్థమవుతుందన్నారు. ఇటువంటి అహంకారపూరిత వ్యాఖ్యలు చంద్రబాబుకే చెల్లునని వరికూటి ఎద్దేవా చేశారు. గతంలో ఏ నాయకులు సాహసం చేయని విధంగా జగన్ మోహన్‌రెడ్డి మంత్రులు, ఎమ్మెల్యేలను గడప గడపకు పంపించి ప్రజల బాగోగులు తెలుసుకుని సమస్యలు పరిష్కరిస్తున్నారని తెలిపారు. పచ్చమీడియా, ప్రతిపక్షాలు జగన్ చేసే కార్యక్రమంలో మంచిని చూడడం ఎప్పుడో మానేశారని దుయ్యబట్టారు. పేదవాడు సుఖంగా ఉండటమే జగనన్న లక్ష్యమని, జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నంతకాలం పేదవాని భవిష్యత్‌కు ఢోకా లేదని, జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పేదల మరుగుదొడ్ల బిల్లులు, ఇంకుడు గుంటలు, నీరు-చెట్టు పథకం ద్వారా కోట్లాది రూపాయల నిధులు స్వాహా చేసిన ఘనత ఎమ్మెల్యే స్వామికే దక్కుతుందని ఆరోపించారు. పార్టీ మండల కన్వీనర్ జి వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్‌లు పోటు శ్రీనివాసరావు, గోవిందు కృష్ణమూర్తి, పార్టీ నాయకులు పూనాటి శ్రీనివాసరావు, దివి శ్రీనివాసరావు, చక్కిరాల ప్రసాదు, సుధాకర్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో మినీలారీ బోల్తా



మద్యం మత్తులో వైద్యశాలలో ఉన్న డ్రైవర్ యల్లముంద



క్షతగాత్రులను వైద్యశాలకు తరలిస్తున్న 108 సిబ్బంది

- ఆరుగురికి గాయాలు
- 108 వాహనంలో వైద్యశాలకు తరలింపు

మర్రిపూడి: డ్రైవర్ మద్యం మత్తుతో మినీలారీ బోల్తా పడింది. ప్రమాదంలో ఆరుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని కూచిపూడి గ్రామశివారులో శనివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..మండలంలోని జువ్విగుంటలో ఓ వివాహ కార్యక్రమంలో పాటకచేరి నిర్వహించేందుకు నర్సరావుపేటకు చెందిన జయశ్రీ ఆర్కెస్ట్రా బృంద సభ్యులు మినీ లారీలో శనివారం రాత్రి జువ్విగుంట గ్రామానికి బయలుదేరారు. వాహనం కూచిపూడి గ్రామ శివారులోకి రాగానే ఎదురుగా గేదెలు అడ్డురావడంతో మద్యం మత్తులో ఉన్న డ్రైవర్ అదుపు చేయలేకపోయాడు. దీంతో మినీలారీ నడిరోడ్డుపై బోల్తాకొట్టింది. విషయం తెలుసుకున్న ఎస్సై పి.అంకమ్మరావు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108 వాహనంలో పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ సంఘటనలో ఇద్దరు మహిళలు, నలుగురు పురుషులకు గాయాలయ్యాయి. ముగ్గురికి రక్త గాయాలు కాగా, ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆదర్శనీయుడు ప్రకాశం పంతులు



ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కనిగిరి రూరల్: టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతిని సందర్భంగా ఘన నివాళి అర్పించారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో స్థానిక వైఎస్సార్ భవన్‌లో ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ఎంపీపీ ప్రకాశం, సొసైటీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, ఏపీఎంసీ సభ్యుడు డాక్టర్ పెరుగు మురళీకృష్ణలు మాట్లాడుతూ తెలుగువారి తెగువకు నిలువెత్తు నిదర్శనం ఆంధ్రకేసరి అని కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా రాష్ట్ర ప్రజలకు అనేక సేవలు అందించారన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం నేటి తరానికి ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాణిక్యరావు, వైస్ ఎంపీపీ తిరుపతిరెడ్డి, కోఆప్షన్ సభ్యులు లింకన్, కౌన్సిలర్లు దేవకి రాజీవ్, దేవరాజ్, షఫీ ఆజాద్, రామనబోయిన శ్రీను, దాసరి మురళీ, జానీ, డాక్టర్ రసూల్, శ్రీహరిరెడ్డి, మన్సూర్, సంధాని, సుబ్బారెడ్డి, సురేష్, తిరుపతిరావు, సర్పంచ్ నాగేంద్ర, మాలీ తదితరులు పాల్గొన్నారు.

వాసిరెడ్డి పద్మకు సన్మానం



వాసిరెడ్డి పద్మను సన్మానిస్తున్న నేతలు

కనిగిరి రూరల్: రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మను మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ శనివారం రాత్రి కనిగిరిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను చైర్మన్ గఫార్, పలువురు నాయకులు ఘనంగా సన్మానించారు. కనిగిరి సీడీపీఓ సంగీత లక్ష్మీ సీఎస్‌పురం జెడ్పీటీసీ మేకల శ్రీనివాసుల యాదవ్ తదితరులున్నారు.

వివాహ వేడుకలో ప్రముఖులు



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధు, మహిళా కమిషన్ చైర్మన్ వాసిరెడ్డి పద్మ

కనిగిరి రూరల్: మండలంలోని శ్రీరంగాపురంలో జరిగిన సీఎస్‌పురం జెడ్పీటీసీ మేకల శ్రీను బావమ్మర్ది వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మలు పాల్గొన్నారు. నూతన వధూవరులు కామనబోయన శంకర్, శ్రావణి దంపతులను ఆశీర్వదించారు. ఏపీ ఎంసీ సభ్యుడు డాక్టర్ పెరుగు ముర ళీ కృష్ణా, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు రంగనాయకులరెడ్డి, సంగు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే బుర్రా

పామూరు: మండలంలోని మోపాడు పంచాయతీ వాకంవారిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు మునగల మాల్యాద్రి కుమారుడు మునగల రాజారెడ్డి వివాహం పూజితతో జరిగింది. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ శనివారం ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి, కల్లూరి రామిరెడ్డి, గాజులపల్లి వెంకటేశ్వరరెడ్డి, గట్లా విజయభాస్కర్‌రెడ్డి పలువురు వధూవరులను ఆశీర్వదించారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న హుసేన్‌రెడ్డి, యాదాలసాయి

పామూరు: వేసవిలో పాదచారులు, వాహనదారులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛంద సేవాసంస్థలు చలివేంద్రాలు ఏర్పాటుచేయడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు యాదాల సాయికిరణ్ అన్నారు. పామూరుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, స్వయంకృషి స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు షేక్.నాయబ్‌రసూల్ తన సొంతనిధులతో స్థానిక సీఎస్‌పురంరోడ్డులో ఏర్పాటుచేసిన మినరల్ వాటర్ చలివేంద్రాన్ని శనివారం వారు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో తాగునీటిని అందించేందుకు సేవా తత్పరతతో దాతలు ముందుకురావడం కొనియాడదగినదన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లూరి రామిరెడ్డి, కో ఆప్షన్ నాయబ్‌రసూల్, జే.గోవిందయ్య, వేల్పుల నారాయణయాదవ్, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, శ్రీరాం శ్రీనివాసులు, యలమంద, స్వచ్ఛందసంస్థ సభ్యులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణాలు కాపాడండి

- పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ వెంకయ్య

మర్రిపూడి: రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలని పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య అన్నారు. స్ఫూర్తి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రక్తదాన శిబిరాన్ని శనివారం ప్రారంభించారు. రక్తం ఎన్ని సార్లు ఇచ్చినా ఎలాంటి ప్రాణ అపాయం ఉండదన్నారు. రక్తాన్ని దానం చేసి ప్రమాదంలో ఉన్న వారిని కాపాడాలని సూచించారు. రక్త శిబిరానికి ట్రినిటీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, వైఎస్సార్ సీపీ నాయకులు గురిజాల యోబు సహాయ సహకారాలు అందించడం అభినందనీయమన్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి అన్నివేళలా అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తానన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బోద రమణారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు బీవీ భాస్కర్‌రెడ్డి, సీనియర్ నాయకులు మాచేపల్లి నాగయ్య, బొట్లా రమారావు, ఎస్సీ నాయకులు గురిజాల యోబు, బొగ్గుల శ్రీనివాసరెడ్డి, మాచేపల్లి హనుమంతురావు పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి బీటెక్ విద్యార్థి మృతి



మనీష్ (ఫైల్ ఫోటో)

చంద్రగిరి (తిరుపతి జిల్లా): చంద్రగిరి మండలంలో కళ్యాణి డ్యాంలో ఈతకు వెళ్లి ఓ విద్యార్థి మృతి చెందాడు. దిన సంఘటన శనివారం జరిగింది. ప్రకాశం జిల్లా పామూరు మండలం చింతలపాలేనికి చెందిన జయప్రకాష్, సరళకు ఇద్దరు కుమారులు. వ్యవసాయం చేసుకుంటూ బిడ్డలను ఇంజినీర్లుగా చూడాలని ఆశపడ్డారు. పెద్ద కుమారుడు పరశురామును బీటెక్ చదివించారు. చిన్న కుమారుడు మనీష్(18) చంద్రగిరి మండలం రంగంపేట సమీపంలో ఓ ప్రైవేట్ కళాశాలలో బీటెక్ చేర్పించారు. శనివారం సెలవు కావడంతో రంగంపేట సమీపంలోని కళ్యాణి డ్యాంలోకి ఐదుగురు విద్యార్థులు ఈతకు వెళ్లారు. ముగ్గురు విద్యార్థులు ఈత కొడుతుండగా మనీష్ అనే విద్యార్థి మునిగిపోయాడు. దీంతో మిగిలిన విద్యార్థులు కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు కాపాడే ప్రయత్నం చేశారు. 108 ద్వారా తిరుపతి రుయా ఆసుపత్రికి నిమిత్తం తీసుకురాగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెడికల్ కళాశాలకు తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

సింగరాయకొండ: జామాయిల్ తోటలో కూలి పనికి వెళ్లి మృతి చెందిన కేసులో శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అనుమానాస్పద మృతిగా కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం..శానంపూడి గ్రామానికి చెందిన చింతలపూడి రమణయ్య(62) గత నెల 7వ తేదీ గ్రామంలోని పులివర్తి లక్ష్మీనారాయణకు చెందిన జామాయిల్ తోటకు కూలీ పనికి వెళ్లాడు. జామాయిల్ కర్ర కొట్టిన తరువాత పొలంలోని జామాయిల్ పుల్లను తగలబెట్టే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు రమణయ్య శరీరానికి మంటలు అంటుకుని మృతి చెందాడు. తరువాత అతని కుమారుడు వెంకట్రావు తండ్రికి అంత్యక్రియలు కూడా చేశాడు. కానీ ఇటీవల స్పందనలో తన తండ్రి అనుమానాస్పదంగా మృతి చెందాడని, నిజాలు నిగ్గుతేల్చాలని కోరుతూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వెంకట్రావు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై షేక్ మహబూబ్‌బాషా తెలిపారు.

పర్యావరణహిత జీవనశైలికి ప్రాధాన్యనివ్వాలి

పామూరు: పర్యావరణహిత జీవనశైలికి ప్రజలు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని డీఆర్‌వో అన్నెబోయిన వెంకటసుబ్బయ్య అన్నారు. మండలంలోని కోడిగుంపల బీట్ పరిధిలోని గోపాలపురం పాతచెరువులో శనివారం ఉపాధిపనులు జరుగుతున్న ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన ఉపాధికూలీలు, మేట్‌లు, ప్రజలకు పర్యావరణహిత జీవనశైలి ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. మొక్కలు నాటి సంరక్షించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఎఫ్‌బీలు దొరసాని, ఉపాది కూలీలు, మేట్‌లు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై గ్రామసభ

సింగరాయకొండ: మండలంలోని పాతసింగరాయకొండ పంచాయతీ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఉపాధి హామీ పథకం గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జరిగిన రూ.67 లక్షల పనులకు సోషల్ ఆడిట్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. గ్రామసభలో కూలీల సంతకాలు లేకుండా డబ్బులు వారి అకౌంట్‌లో జమ అయినట్లు గుర్తించామని, అలాగే పనుల రిజిష్టర్, ఫిర్యాదులు రిజిష్టరు, ఇతర రిజిష్టర్లు కూడా అధికారులు ఇవ్వలేదని డీఆర్‌పీ డి.రామకోటయ్య ఆరోపించారు.. ఏపీఓ సీహెచ్ వి.సుధాకరరావు, పంచాయతీరాజ్ ఏఈ కె.శ్రీహరి, ఈఓ ఎస్ మారుతీబాబు, టీఏఎన్ బాబు, ఫీల్డ్ అసిస్టెంట్ భాస్కర్, గ్రామ సచివాలయ సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

జగనన్న ఆణిముత్యాలు అవార్డుకు ఎంపిక



మల్లెల పరిమళ



దాచర్ల తేజస్విని



నేరెళ్ల శ్రీరామ్



కె జ్యోతి శ్రీ దేవహర్షిణి

జరుగుమల్లి(సింగరాయకొండ): పదో తరగతి పరీక్షా ఫలితాల్లో నియోజకవర్గస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచి జగనన్న ఆణిముత్యాలు అవార్డుకు నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈఓ బి.నాగేంద్రవదన్ తెలిపారు. ప్రథమ, తృతీయ స్థానాలను జరుగుమల్లి మండలం, ద్వితీయస్థానాన్ని పొన్నలూరు మండలం కైవసం చేసుకుంది. మండలంలోని కామేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు మల్లెల పరిమళ, దాచర్ల తేజస్వినిలు ఇద్దరు 576 మార్కులతో ప్రథమస్థానాన్ని, పచ్చవ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నేరెళ్ల శ్రీరామ్, కార్నాటి జ్యోతి శ్రీ దేవహర్షిణిలు ఇద్దరు 571 మార్కులతో తృతీయస్థానాన్ని కైవసం చేసుకున్నారు. పొన్నలూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పాలడుగు వైజయంతి 572 మార్కులతో ద్వితీయస్థానాన్ని కైవసం చేసుకుందని ఆయన వివరించారు. మండలానికి నాలుగు అవార్డులు సాధించిన విద్యార్థులను, పాఠశాల ఉపాధ్యాయులను ఎంఈఓ నాగేంద్రవదన్ ప్రత్యేకంగా అభినందించారు.